


**121**
**ధారావాహిక**

# జాయ సేనాపతి

## చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి ...
99893 71284

**జరిగిన కథ :** తక్షణమే అనుమకొండ రావాల్సిందిగా అక్క నారాంబ నుంచి వార్త. మురారి ఏం కొంపలు ముంచాడో అనుకుంటూ.. వాయువేగంతో అనుమకొండకు వచ్చాడు జాయప. అంతఃపురంలోకి ప్రవేశించేసరికి.. దీనంగా పిచ్చిచూపులు చూస్తోంది నారాంబ. ఆమె ఏం చెబుతుందో తెలియక ముఖంలో దిగులు తన్నుకొస్తోంది. రుద్రమ గురించి చెబుతూ.. వెక్కెక్కి ఏడుస్తున్నది. ఆమె అత్తగారు ఉదయాంబికదేవి మహా దుర్మార్గురాలనీ, రుద్రమను చిత్రహింసలు పెడుతోందనీ చెబుతున్నది.

‘‘మీ పురుషుల బుద్ధి ఎప్పుడూ యుద్ధాలు, కత్తులు, కటార్లపైనే ఉంటుంది. మా మహిళల సమస్యలు మీకు పట్టవు గదా. తండ్రిగారు కదా అని వారికి చెబితే.. వారు నీకు చెబుతారు. ‘జాయమామ వీరభద్రుడితో మాట్లాడతాడు. అప్పటివరకూ ఇక్కడే ఉండమ్మా!’ అన్నారు. పాపం ఇక్కడే ఉంది. కానీ, నిన్ననే అల్లుడుగారు విచ్చేశారు. ఇద్దరూ కొలనుపాక వెళ్లారు..’’

చెబుతున్న నారాంబ ఏడుపు ఆగింది. కానీ, వెక్కిళ్లు ఆగడం లేదు. ఏడుపు ఉప్పెనలో ఆమె పవిట తడిసి ముద్దయ్యింది.

‘‘అక్కా.. నువ్వు ప్రతి చిన్న అంశానికీ దుఃఖపడుతున్నావు. ముసలమ్మ.. అదే అమ్మమ్మవు అయ్యావుగా.. సహజమే! కాస్త కళ్లు తుడుచుకో..’’ అంటూ దగ్గరకు తీసుకుని ఊరడించి కన్నీరు తుడిచాడు.

ఈ సంఘటన ఆయనలో తీవ్ర ఘర్షణకు కారణమయ్యింది. ఆలోచించి ఓ నిర్ణయం తీసుకున్నాడు.

* * *

కాకతీయ సార్వభౌముని మొదటి కొలువు సమయం.

వందిమాగధుల స్తోత్రపాఠాల నడుమ గణపతిదేవుడు ప్రవేశించి ఆసనాన్ని అధిష్ఠించాడు. ప్రధానులు, మంత్రులు, ముఖ్య సేనానాయకులు ఆసీనులయ్యారు. పక్కన తన ఆసనంలో గజసాహిణి జాయచోడుడు కూడా కూర్చున్నాక.. ఓ యువ యోధుడు సింహద్వారం నుంచి ప్రవేశించి చిరుతపులిలా కదలి వస్తున్నాడు.

అంతా విభ్రమగా అటు చూస్తున్నారు.. చక్రవర్తి సహా.

ఆ ఆగంతక యోధుడు వేదికపైకి వచ్చి చక్రవర్తికి నమస్కరించాడు. జాయచోడుడు లేచి.. పక్కన అప్పటికే ఏర్పరచి ఉంచిన మరో సముచితాసనాన్ని చూపాడు సగౌరవంగా. అతడు ఆసనం వరకు వెళ్లాడుగానీ కూర్చోలేదు. సభాముఖంగా తిరిగి అందరికీ వంగి నమస్కరించాడు. అప్పుడప్పుడే సభాముఖ్యులు ఆ ఆగంతకుణ్ని గుర్తిస్తున్నారు. చక్రవర్తి కూడా అప్పుడే గుర్తించాడు.

రుద్రమదేవుడు!! పురుష ఆహార్యంలో యుద్ధవీరుని తలపిస్తున్న రుద్రమదేవి!

పురుష ఆహార్యంలో చూసిన మనిషే అయినా.. ఇప్పుడు ముగ్గురుపిల్లల తల్లిగా వయసు పెరిగి హుందాగా ఉండటంతో వెనువెంటనే గుర్తించలేదు. గుర్తించాక అంతా సంభ్రమంగా చూడసాగారు.

‘‘ఇదేమిటి.. ఈ హఠాత్పరిణామం?’’ అబ్బురంగా అన్నాడు గణపతిదేవుడు.

ఆయన ముఖంలో దాచుకోలేని ఆనందం వరదకృష్ణమ్మలా సుళ్లు తిరుగుతోంది.

‘‘మామ ఆదేశం..’’ అంది రుద్రమ.

జాయచోడుడు లేచాడు.

‘‘కాకతీయ సభాసదులందరికీ నమస్సుమనస్సులు! కాకతీయ సభ మరీ వృద్ధవాసన వస్తోంది. అంతా వృద్ధాప్యానికి ఆహ్వానం పలికే వయసుకు వస్తున్నాం. కాస్త యువగాలుల కోసం నేనే రుద్రమదేవులవారిని ఆహ్వానించాను. మగపిల్లవానిగా ప్రకటించిన నాడు రుద్రమదేవుడే యువరాజుగా, వారసుడుగా ప్రకటించారు కూడా. ఇప్పటికీ అదే చెల్లుబాటులో ఉందని సభాసదులకు గుర్తుండే ఉంటుంది. మరికొన్ని రోజులలో యువ